సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శనివారం । 28 । డిసెంబర్ । 2024



ఎయిర్‌పోర్టుకు భూములివ్వలేం

పోలవరం కాలువ, పుష్కర పథకం, హైవేలకు ఇప్పటికే భూములిచ్చిన తాము ఉన్న కాస్త పొలాలను ఎయిర్‌పోర్టుకు ఇచ్చి నష్టపోలేమని రైతులు స్పష్టం చేశారు.


8లో



పిఠాపురంలో ఫ్లెక్సీల రగడ

పిఠాపురం పట్టణంలో పలుచోట్ల జనసేన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది శుక్రవారం తొలగించడం కూటమి పార్టీల మధ్య రగడకు కారణమైంది.

డెల్టా కాలువలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 9,745 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. దీనిలో తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,870, పశ్చిమ డెల్టాకు 5 వేలు చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.70 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

2న అంతర్వేది ఉత్సవాలపై సమీక్ష

అమలాపురం టౌన్: అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలకు సంబంధించి 2025 జనవరి 2వ తేదీన ఆ దేవస్థానంలో అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్టు అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది స్వామివారి కల్యాణోత్సవం, రథోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. అంతర్వేది ఉత్సవాలు 2025 ఫిబ్రవరి 4 నుంచి 13 తేదీ వరకూ జరుగుతాయని తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీ రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం, 8వ తేదీ రథోత్సవం, 12వ తేదీ స్వామివారి సముద్ర స్నానం, 13వ తేదీ తెప్పోత్స కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ఉత్సవాల నిర్వహణ, బందోబస్తు, భక్తులకు సౌకర్యాలు వంటి అంశాలపై సమీక్షించనున్నట్లు ఆర్డీవో మాధవి స్పష్టం చేశారు.

ఎస్సీల జనాభాపై సోషల్ ఆడిట్

అమలాపురం రూరల్: ఎస్సీ కులగణన వివరాలను గురువారం నుంచి గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శించనున్నారని అంబేడ్కర్ కోనసీమ జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.జ్యోతి లక్ష్మీదేవి ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు దీనిపై అభ్యంతరాల స్వీకరించి, జనవరి 6వ తేదీ వరకు అభ్యంతరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. సమగ్ర వివరాల సేకరణ అనంతరం జనవరి 10న కులగణన తుది వివరాలను గ్రామ వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారని తెలిపారు. పేరు, అధార్ నంబర్, పుట్టిన తేదీ, వయస్సు, ఉపకులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి వ్యవసాయం ఇతర వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ డేటాపై అభ్యంతరాలను వీఆర్వోలు స్వీకరిస్తారు. వీటిని మూడు దశలలో తనిఖీ చేస్తారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను ఆర్ఐకు నివేదిస్తారు. వీఆర్వో, ఆర్ఐల నివేదికలో వివరాలను తహసీల్దార్ పరిశీలించి, పోర్టల్‌లో నమోదు చేస్తారు.

తటవర్తి భారతి స్మారక పురస్కారానికి 'దాట్ల' ఎంపిక



దేవదానం రాజు

యానాం: పట్టణానికి చెందిన ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానం రాజు తటవర్తి భారతి స్మారక పురస్కారానికి ఎంపికయ్యారు. ఆదివారం విశాఖపట్టణం పౌరగ్రంథాలయంలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నారని శుక్రవారం దాట్ల దేవదానంరాజు ప్రకటనలో తెలిపారు. అమెరికా నివాసి, తెలుగుభాషాభిమాని, రచయిత తటవర్తి త్రినాథనాగేశ్వరరావు తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన సాహితీవేత్తలకు సత్కారం చేస్తుంటారు. కలైమామణి, తెలుగురత్న, తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం వంటి పురస్కారాలు ఇప్పటికే దాట్ల అందుకున్నారు. ఆరు కథాసంపుటాలు, ఏడు కవితా సంపుటాలు, రెండు దీర్ఘకవితలు, చరిత్ర గ్రంథం, రాజకీయ వ్యంగ్య కథనాలను వెలువరించారు.

ఉత్కంఠగా చదరంగం పోటీలు



బహుమతులు అందిస్తున్న సత్యనారాయణ, నాగేశ్వరరావు

అమలాపురం రూరల్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్రస్థాయి ఓపెన్ ర్యాంకింగ్ చదరంగ పోటీలు కోనసీమ జిల్లా అసోసియేషన్ సహకారంతో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సాహిత్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి 200 మందికి పైగా చెస్ క్రీడాకారులు పోటీపడ్డారు. అంతర్జాతీయ రేటింగ్ కలిగిన చెస్ క్రీడాకారులు సుమారు 100 మంది వరకు పాల్గొన్నారు.విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పప్పుల శ్రీరామచంద్రమూర్తి, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ముషిణి సత్యనారాయణ, ఎన్నారై గుబ్బల నాగేశ్వరరావు బహుమతులు అందించారు. విజేతలు జనవరి 17న పెద్దాపురంలో జరిగే నేషనల్ స్కూల్ చెస్ టోర్నమెంట్‌కు అర్హులవుతారు. అండర్ -6 అండర్- 8, అండర్ 10, అండర్- 12, అండర్- 14, అండర్ -16 బాలురు, బాలికలు విభాగల వారీగా మొదటి మూడు కేటగిరిల్లో బహుమతులు అందించారు.

ఘనంగా చండీ హోమం

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఆలయంలో ఉదయం 9 గంటలకు పూజలు చేసిన అనంతరం హోమం ప్రారంభించి, 11.30 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. ఈఓ వి.సుబ్బారావు దంపతులతో పాటు 50 మంది రూ.750 టికెట్టుతో హోమంలో పాల్గొన్నారు.

బల్బులు చేతబట్టి..



కొత్తపేటలో పోరుబాట నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, పార్టీ శ్రేణులు

కొత్తపేట: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా కొత్తపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమం జరిగింది. రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో రావులపాలెం నుంచి కొత్తపేట పాత బస్టాండ్ వరకు మోటార్ సైకిల్ ర్యాలీగా వచ్చారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి విద్యుత్ బల్బులు, ప్ల కార్డులు చేతబట్టి స్థానిక ఏడీఈ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏడీఈ డి.చిట్టిరాజుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

నినాదాలు చేస్తూ పాదయాత్రగా..



మండపేటలో నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు తదితరులు

మండపేట: మండపేటలో వైఎస్సార్ సీపీ నిర్వహించిన పోరుబాట కార్యక్రమం ఎమ్మెల్సీ, నియోజకవర్గ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో జరిగింది. మండపేట పట్టణంతోపాటు కపిలేశ్వరపురం, రాయవరం మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చాయి. తొలుత మండపేటలోని పార్టీ కార్యాలయం నుంచి కలువ పువ్వు సెంటర్ మీదుగా మారేడుబాక వంతెన వద్ద వరకు వెళ్లి అక్కడ నుంచి పాదయాత్రగా విద్యుత్ సబ్ స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని నినాదాలు చేస్తూ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. విద్యుత్ శాఖ ఏఈఈ మునీకి ఎమ్మెల్సీ తోట తదితరులు వినతిపత్రం అందజేశారు.

రుబాబుపై పోరు

సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యులపై భారం మోపుతున్న కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా వైఎస్సార్ సీపీ సమర శంఖారావం పూరించింది. కూటమి ప్రభుత్వం సర్దు'పోటు'కు నిరసనగా శుక్రవారం పోరుబాట పట్టింది. కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో జరిగిన నిరసన ప్రదర్శనలో వందల మంది కార్యకర్తలు, నాయకులు కదం తొక్కారు. మోటారు సైకిల్ ర్యాలీలు, పాదయాత్రగా నిరసన ప్రదర్శనలు, విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలు, కూటమి ప్రభుత్వం తప్పుడు విధానాలపై నినాదాలతో హోరెత్తించారు.

- సామాన్యులకు దన్నుగా కదలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి పెంచడంపై ఆందోళనలు
- కూటమి అధికారంలోకి వచ్చాక దొడ్డి దారిన వసూలుపై నిరసన
- కోనసీమ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో నిర్వహణ
- భారీ ర్యాలీలు, విద్యుత్ శాఖ కార్యాలయాల వద్ద ప్రదర్శన

సాక్షి, అమలాపురం: పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో జరిగిన పోరుబాటు ప్రదర్శనలలో పాల్గొన్న ఎంపీ, జెడ్పీ చైర్మన్‌తోపాటు ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఎన్నికలలో గెలిపిస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు సర్దుబాటు పేరుతో పేదలు, సామాన్యుల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో విద్యుత్ చార్జీలు పెంచేందుకు సిద్ధం కావడంపై వారు మండిపడ్డారు. చంద్రబాబు ఎన్నికల హామీలను ఎప్పుడూ పట్టించుకొన్న పాపాన పోలేదని ఎద్దేవా చేశారు. ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ రాయితీలు నిలుపుదల చేయడం, ఆక్వా రైతులకు అదనపు విద్యుత్ వాడకంపై వేలాది రూపాయల బిల్లులు వేయడాన్ని తప్పుబట్టారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించాలని వారు డిమాండ్ చేశారు.



ర్యాలీగా వెళుతున్న మాజీ మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, మాజీ ఎంపీ అనూరాధ

ప్లకార్డులతో నిరసన



పి.గన్నవరం సబ్ స్టేషన్ వద్ద జెడ్పీ చైర్మన్ వేణు గోపాలరావు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణుల నిరసన

పి.గన్నవరం: విద్యుత్‌పై వైఎస్సార్ సీపీ పోరుబాట పి.గన్నవరం నియోజకవర్గంలో హోరెత్తింది. జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు స్థానిక మెయిన్ రోడ్డు నుంచి సబ్‌స్టేషన్ వరకు పాదయాత్ర చేసుకుంటూ ర్యాలీగా తరలివెళ్లారు. సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన కార్యక్రమం చేపట్టారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేశారు. విద్యుత్ శాఖ ఏఈఈ జి.వి.ఆచార్యులుకు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవితోపాటు అన్ని మండలాలకు చెందిన పార్టీ నాయకులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ

అమలాపురం: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో అమలాపురంలో పోరుబాట జరిగింది. అమలాపురం పట్టణం హైస్కూల్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఈదరపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ రాజబాబు, ఈఈ మోకా రవి కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనూరాధ పాల్గొన్నారు.

విద్యుత్ రాయితీలు కొనసాగించాలని వినతి



మలికిపురంలో పోరుబాట బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి గొల్లపల్లి

రాజోలు: రాజోలు నియోజకవర్గం పరిధిలో మలికిపురంలో వైఎస్సార్ సీపీ పోరుబాట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో జరిగింది. మలికిపురం కడలిలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. మలికిపురం సెంటర్ నుంచి ప్రధాన రహదారి మీదుగా వి.వి.మెరక గ్రామంలోని సబ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా నినాదాలు చేశారు. ఎస్‌సీ, ఎస్టీ, ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీలు కొనసాగించాలని డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఈఈ బొలిశెట్టి ప్రసాద్‌కు అందజేశారు.

సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

ముమ్మిడివరం: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జోరుగా సాగాయి. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన పార్టీ శ్రేణులతో కలిసి సతీష్‌కుమార్ ముమ్మిడివరం పార్టీ కార్యాలయం నుంచి కాశి వాణి తూము వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. మండలాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ, పార్టీ శ్రేణులు

ఎంపీ వెంట రాగా..



రామచంద్రపురం మెయిన్ రోడ్డులో నిరసన ప్రదర్శనగా వెళుతున్న ఎంపీ సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్

రామచంద్రపురం: రామచంద్రపురం నియోజకవర్గంలో విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ చేపట్టిన నిరసన కార్యక్రమం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో జరిగింది. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి ఏపీ ఈపీడీసీఎల్ డీఈఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మధ్యలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్‌తో పాటు పార్టీ నాయకులతో కలిసి సూర్యప్రకాష్ ఈఈ కె.రత్నాలరావుకు వినతిపత్రం అందజేశారు.

ఎల్.గన్నవరంలో అనధికార ఇసుక ర్యాంపు

పి.గన్నవరం: మండలంలో కూటమి నేతల కనుసన్నల్లో ఎల్.గన్నవరం శివారులో వశిష్ట నదీపాయలో అనధికార ఇసుక ర్యాంపు ఏర్పాటు అయ్యింది. దీనికి సమీపంలో గత టీడీపీ ప్రభుత్వం హయాంలో పెద్ద ఎత్తున అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిగాయి. అప్పట్లో ఆ ర్యాంపుని లోకేష్ ర్యాంపుగా పిలిచేవారు. దానికి సమీపంలోనే ఇప్పుడు ఒక మహిళ కొత్తగా ర్యాంపును ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల క్రితం ఆమె పట్టా భూములను లీజుకు తీసుకుని అక్కడ ఇసుక తీసేందుకు ప్రయత్నించగా వివాదం జరిగింది. ఎల్.గన్నవరం మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వెనుక వశిష్ట నదిలో అమలాపురం ప్రాంతానికి చెందిన ఆ మహిళ అనధికారికంగా ఇసుక ర్యాంపును ఏర్పాటు చేశారు. ఇసుక తెన్నెల్లో కొబ్బరి ఆకులు వేసి బాటలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ర్యాంపులో శుక్రవారం నుంచి ఇసుక తవ్వకాలు ప్రారంభమయ్యాయి. ఇక్కడ ట్రాక్టర్‌పై రూ.800కు ఇసుకను లోడు చేస్తున్నారు. అధికారులు



ఎల్.గన్నవరంలో కొబ్బరాకులతో వేసిన బాట

పట్టించుకోవడం లేదు. మండలంలోని జి.పెదపూడి శివారు బూరుగులంక నదీపాయలో కూడా కూటమి నేతల కనుసన్నల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. రోజుకు సుమారు 15 ట్రాక్టర్లతో 50 నుంచి 60 ట్రిప్పుల ఇసుకను తవ్వుకుపోతున్నారు. ఇసుక ఎందుకు తవ్వుతున్నారని ప్రశ్నిస్తే ఎదురుదాడికి దిగుతున్నారని స్థానికులు చెబుతున్నారు. డీఎస్ పాలెంలో కూడా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి.

ఆర్థిక సంస్కరణల పితామహుడు మన్మోహన్

సంతాప సభలో మాజీ మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: దేశ ఆర్థిక సంస్కరణల పితామహుడు మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ అని మాజీ మంత్రి, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ అన్నారు. స్థానిక హైస్కూల్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం జరిగిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ సంతాప సభలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధతో కలసి పాల్గొన్న విశ్వరూప్ మాట్లాడారు. తొలుత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి వారు నివాళులర్పించారు. మన్మోహన్ మరణం దేశ ఆర్థిక వ్యవస్థకు తీరని లోటని పేర్కొన్నారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి పార్టీ నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. సంతాప సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, చిత్రపు రామకృష్ణ, బండారు గోవిందు, దొమ్మేటి రాము, కట్టోజు సన్నయ్యదాసు, పార్టీ నాయకులు కముజు రమణ, సూదా గణపతి, పొగాకు శ్రీను, ఈతకోట శ్రావణ్, ఖ్వాజాబాబు పాల్గొని మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు.



మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, మాజీ ఎంపీ అనురాధ తదితరులు

కూటమి నాయకుల వికృత చేష్టలు

- కొమరాజులంక పంచాయతీ పార్క్ ప్రధాన ద్వారం పేర్లు ధ్వంసం
- ఖండించిన మాజీ మంత్రి విశ్వరూప్, మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: మండలంలోని కొమరాజులంక గ్రామపంచాయతీ పార్కును శుక్రవారం గ్రామానికి చెందిన కూటమి నాయకులు అనుచరులతో కలిసి ధ్వంసం చేశారు. పార్క్ ప్రధాన ద్వారం పై ఉన్న పేర్లను తొలగించి అక్కడ ఉన్న ప్రజాప్రతినిధుల ఫొటోలను తీసివేశారు. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమరాజులంక గ్రామ పంచాయతీ సర్పంచ్ కర్రి గోవింద కృష్ణారెడ్డి పంచాయతీ కార్యవర్గంతో సమావేశం నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన కూటమి నాయకులు మెండి నాగేశ్వరరావు, గుర్రాల రాజులు తమ అనుచరులతో కలిసి పంచాయతీ వద్దకు వెళ్లి మీటింగ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో పార్క్‌లో కొన్ని పనులు చేయలేదంటూ అడిగారు. దీనిపై స్పందించిన సర్పంచ్ కృష్ణారెడ్డి పార్కుకు కావలసిన పనులు చేపట్టాలని కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. అయితే సంతృప్తి చెందని కూటమి నాయకులు గ్రామంలో పలు



కూటమి నాయకులు పేర్లు తొలగించడంతో కళావిహీనంగా మారిన కొమరాజులంకలో పార్కు ప్రధాన ద్వారం



పార్కు ధ్వంసం ఘటనపై సీఐ విద్యాసాగర్‌తో మాట్లాడుతున్న విశ్వరూప్, జగ్గిరెడ్డి

రోడ్లు వేయాలంటూ అడిగారు. దీనిపై కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే రూ.60 లక్షలు తన సొంత నిధులతో పలు రోడ్లు నిర్మించానని, పంచాయతీలో నిధులు లేని కారణంగా అధికారంలో ఉన్న మీ నాయకుల నుంచి నిధులు తీసుకురండి దానికి కావలసిన పంచాయతీ తీర్మానాలు చేసి ఇస్తానంటూ సమాధానం ఇచ్చారు. దీంతో చేసేది లేక అక్కడే సమీపంలో ఉన్న పార్కు వద్దకు కూటమి నాయకులు చేరుకొని పార్కుకు ఉన్న పేర్లను, ఫొటోలను తొలగించారు. దీనిపై కృష్ణారెడ్డి స్పందిస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పార్కులోని పలు విద్యుత్ లైట్లను, శిలాఫలకాలను ధ్వంసం చేశారని ఇప్పుడు పార్కు అభివృద్ధి చేయాలని అడిగే వంకతో పంచాయతీ కార్యవర్గ సమావేశాన్ని అడ్డుకోవాలన్న దురుద్దేశంతో వచ్చి చేసేదిలేక పార్కులు పాడు చేశారన్నారు. ఈ విషయాన్ని ఆయన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.

ఆస్తులు ధ్వంసం చేయడం సరికాదు : మాజీ మంత్రి విశ్వరూప్

విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పిన్నిపే విశ్వరూప్ జగ్గిరెడ్డితో కలసి కొమరాజులంక చేరుకుని పార్కును పరిశీలించారు. కోట్లాది రూపాయలు నిధులతో నిర్మించిన పార్కులో సర్పంచ్ తన సొంత నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే వాటిని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించి మరింత అభివృద్ధి చేయాలే గాని, ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యం కాదని విశ్వరూప్ హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యంలో సరైన విధానం కాదన్నారు. సర్పంచ్‌కు ఉన్న హక్కులను కాలరాసే విధంగా అడ్డుపడటం మంచి పద్ధతి కాదన్నారు. పంచాయతీ పార్కును ధ్వంసం చేయడంపై పోలీస్ శాఖకు, పంచాయతీరాజ్ శాఖకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పాటు కూటమి నాయకులపై చర్యలు తీసుకునేలా చేస్తామని, భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడితే వైఎస్సార్ సీపీ తరఫున జిల్లాస్థాయిలో వారికి తగిన బుద్ధి చెప్తామన్నారు.

చూస్తూ ఊరుకునేది లేదు

మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ తమ హయాంలో రుడా నిధులు, కోట్లాది రూపాయల సీఎం నిధులు తీసుకువచ్చి గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని చెప్పారు. పార్క్‌తో పాటు ఎన్నో రోడ్లు, భవనాలు, పాఠశాలల భవనాలు నిర్మించామన్నారు. అభివృద్ధి చేయడమంటే వీటన్నింటిని తొలగించుకుంటూ పోతారా అంటూ కూటమి నాయకులను ప్రశ్నించారు. కూటమి నాయకులు తమతో అభివృద్ధిలో పోటీ పడితే సహకరిస్తామని, కానీ ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తూ పోతే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. వారి వికృత చేష్టలకు తగిన విధంగా ప్రజలే బుద్ధి చెప్పే విధంగా చేస్తామన్నారు. పార్కు ధ్వసం చేసిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని సీఐ విద్యాసాగర్‌కు సూచించారు. కార్యక్రమంలో అమ్ముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, కోనాల రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఫైరింగ్ శిక్షణను పరిశీలించిన ఎస్పీ



పెద్దాపురం ఫైరింగ్ మెట్టపై శిక్షణలో భాగంగా గన్ షూటింగ్ చేస్తున్న ఎస్పీ

పెద్దాపురం: పెద్దాపురం మెట్టపై పోలీసు సిబ్బందికి జరుగుతున్న వార్షిక ఫైరింగ్ శిక్షణను శుక్రవారం ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పరిశీలించారు. అత్యాధునిక ఏకే-47, ఇన్సాస్, ఎల్‌ఎంజీ ఎస్ ఎం-5 తదితర లాంగ్ రేంజ్, షార్ట్ రేంజ్ ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ చేయడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ ఆయుధాల పనితీరు, సామర్థ్యాన్ని ఆయన క్షుణంగా పరిశీలించి రేంజ్ పరిధిలోని సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. ట్రైనీ ఏఎస్పీ సుష్మిత, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ శ్రీహరిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన



సదస్సులో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ శ్రీదేవి

రాజోలు: స్వయం ఉపాధి పథకాల ద్వారా దళిత వర్గాలకు ఆర్థిక స్వాలంబన కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. శుక్రవారం శివకోడులోని కాపు కల్యాణ మండపంలో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘ కార్యనిర్వహక సంచాలకులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న ఎస్సీ ప్రణాళికలు, ఇ-ఆటోలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల ద్వారా ఉపాధి కల్పించాలని సూచనలు జారీ చేశారు. కార్పొరేషన్ డైరెక్టర్లు వల్లూరి రాజా, ఎం.చంద్రశేఖర్, కార్పొరేషన్ ఈడీ జె.సత్యవతి పాల్గొన్నారు.

అసలుకు భరోసా.. భవిత కులాసా..

- బాలికలు, మహిళల కోసం పోస్టల్ పథకాలు
- ఆకర్షణీయంగా సుకన్య సమృద్ధి యోజన
- గడువు ముగియనున్న మహిళా సమ్మాన్

రాజమహేంద్రవరం సిటీ: బాలికల, మహిళల ఆర్థిక పురోభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా పొదుపు పథకాలను ప్రవేశ పెట్టింది. బాలికలకు సుకన్య సమృద్ధి యోజన, మహిళలకు మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని అమలు చేస్తోంది. పొదుపు చేసిన సొమ్ముకు భద్రతతో పాటు ఈ రెండు పథకాలు బాలికలకు, మహిళలకు భరోసానిచ్చే విధంగా ఉన్నాయి. మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి మహిళలందరూ ఈ పథకంలో చేరేందుకు అవకాశం కల్పించింది. 2025 మార్చి 31 మాత్రమే అమల్లో ఉండే ఈ స్కీమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు డ్రైవ్‌లు నిర్వహించేందుకు తపాలా శాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఈ పథకంలో రూ.1,000 నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్‌కు అవకాశం ఉంది.

వన్ టైమ్ సేవింగ్స్ స్కీమ్

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకం వన్ టైమ్ సేవింగ్స్ స్కీమ్‌గా కొనసాగుతుంది. గరిష్ట మొత్తానికి రూ.2లక్షల లోబడి ఎన్ని ఖాతాలైనా తెరిచే అవకాశాన్ని కల్పించింది. ఇప్పటికే ఖాతా ఉంటే కనీసం మూడు నెలల విరామంతో మళ్లీ ఖాతా తెరవవచ్చు. సేవింగ్స్ ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి రెండేళ్లు పూర్తయిన తర్వాత మెచ్యూరిటీ కింద డబ్బులు డ్రా చేసుకునే అవకాశం ఉంది. వడ్డీ రేటు మాత్రం ఏడాదికి 7.5 శాతం ఉంటుంది. ఒకరి పేరుతోనే ఖాతా తెరవాలి. జాయింట్ అకౌంట్ సౌకర్యం లేదు. మైనర్ అయితే గార్డియన్ ద్వారా డిపాజిట్ చేసుకునే వీలుంటుంది.



రాజమహేంద్రవరం హెడ్ పోస్టాఫీస్

మహిళా సమ్మాన్ సేవింగ్స్‌లో సొమ్ము పెరిగేది ఇలా (రూ.లలో) ..

డిపాజిట్	2 ఏళ్ల తర్వాత వచ్చే మొత్తం
1,000	1,154
10,000	11,542
50,000	57,714
1,00,000	1,15,428
2,00,000	2,30,854

స్కీమ్‌లో చేరే విధానం

మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీమ్‌లో చేరే లబ్ధిదారులు ఆధార్, పాన్ కార్డు, మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకుని దగ్గరలోని పోస్టాఫీసుకు వెళ్లి ఖాతా ప్రారంభించాల్సి ఉంటుంది. ఈ సేవింగ్స్ సర్టిఫికెట్ కింద డిపాజిట్ చేసిన వారు ఏడాది తర్వాత 40 శాతం డబ్బు ఉపసంహరించుకునే అవకాశముంది. ఒకవేళ డిపాజిట్‌దారులు మృతి చెందితే కారుణ్యం కింద ఖాతా మూసేయవచ్చు. ఎవరైనా మృతి చెందితే తదుపరి నామినీకి ఆ మొత్తాన్ని చెల్లిస్తారు. అవసరాన్ని బట్టి రెండు శాతం తగ్గించుకుని (5.5 శాతం వడ్డీతో)ఆరు నెలల తర్వాత ఎప్పుడైనా ఖాతాను మూసేయవచ్చు.

సుకన్య సమృద్ధి యోజన

ఈ పథకంలో చేరేందుకు 10 సంవత్సరాల లోపు బాలికలు అర్హులు, కనీసం రూ.250 డిపాజిట్‌తో ఆడపిల్ల పుట్టినప్పుడు ఖాతా తెరిచి, ప్రతీ నెలకు కనీసం వంద రూపాయలు పొదుపు చేస్తే, తల్లిదండ్రుల మొత్తం పెట్టుబడి రూ.18,000 (15 సంవత్సరాలకు) పెడితే వారికి మెచ్యూరిటీగా (21 సంవత్సరాల తర్వాత) రూ. 53,945 తపాలాశాఖ అందిస్తుంది.



మహిళా సమ్మాన్ సేవింగ్స్ ఉపయోగాలు తెలిపే చార్ట్

అవగాహన కల్పిస్తున్నాం



రాజమహేంద్రవరం పోస్టల్ డివిజన్ పరిధిలో రెండు హెడ్ పోస్టాఫీసులు (రాజమహేంద్రవరం, రామచంద్రపురం) 63 సబ్ పోస్టాఫీసులు, 307 బ్రాంచి పోస్టాఫీసులు ఉన్నాయి. ఈ పోస్టాఫీస్ పరిధిలో ఇప్పటి వరకూ 7000 మంది మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకంలో చేరారు. 60,000 మంది సుకన్య సమృద్ధి యోజనలో చేరారు. ఈ రెండు పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సుకన్య సమృద్ధి యోజనను ఆడపిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి

– కే.శేషారావు, సూపరింటెండెంట్

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రైలు నుంచి జారిపడి మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

తుని: తుని–గుల్లిపాడు మధ్యలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం అందిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామన్నారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి 40 ఏళ్ల వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. తెలుపురంగు కలిగి, 5.5 అడుగులు ఎత్తుతో తెలుపు రంగు బనియన్‌పై నలుపు రంగు చారలు కలిగిన నెక్ బనియన్, నలుపురంగు నైట్ ట్రాక్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు..

సీతానగరం: మండలంలోని మిర్తిపాడుకు చెందిన తానారి ప్రభాకరరావు (28) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 8.30 గంటలకు మృతి చెందాడని హెడ్‌కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు ప్రభాకరరావుకు వివాహం కాలేదని, అప్పులు ఉండటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ప్రశ్నించడంతో ఈ నెల ఒకటిన ఫ్యాన్‌కు ఉరి వేసుకోగా, గమనించిన కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం ఉదయం చికిత్స పొందుతూ మరణించాడు. తమ్ముడు దుర్గ ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు, ఆసుపత్రి సమాచారంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు

ధాన్యపు కుచ్చులు ఫర్ సేల్!

రామచిలుకలు, పిచ్చుకలు ఇంటి హాల్లో పెట్టిన ధాన్యపు కుచ్చులలో ఉన్న గింజలను తింటూ ఉంటాయి. వీటిని ఎక్కువగా పల్లెల్లో చూస్తాం. ఇప్పుడు ఆ సంప్రదాయం పట్టణాలకు వ్యాప్తి చెందింది. దీనిని దృష్టిలో ఉంచుకుని రాజానగరం మండలం సంపత్‌నగరం గ్రామానికి చెందిన రైతు యాళ్ల రుద్రం ధాన్యపు కుచ్చులను ప్రత్యేకంగా అల్లి బొమ్మూరు జంక్షన్‌లో 20 రోజులుగా విక్రయిస్తున్నారు. కుచ్చు సైజును బట్టి రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నాడు. ఈ ధాన్యపు కుచ్చులను చూసినవారు ఆసక్తిగా తిలకించడంతో పాటు కొనుగోలు చేసుకుని వెళుతున్నారు.

– రాజమహేంద్రవరం రూరల్



బొమ్మూరు జంక్షన్‌లో ధాన్యపు కుచ్చులను విక్రయిస్తున్న రైతు రుద్రం

ఎయిర్‌పోర్టుకు భూములివ్వలేం

- ఇప్పటికే పోలవరం, పుష్కర, రహదారులకు పొలాలను కోల్పోయాం
- పి.ఇ.చిన్నాయపాలెం రెవెన్యూ సదస్సుల్లో ఏబీసీ రైతు సంక్షేమ సంఘం నాయకులు



తొండంగి మండలం పి.ఇ.చిన్నాయపాలెం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ మురార్జీకి వినతిపత్రం ఇచ్చిన ఏబీసీ రైతుల సంక్షేమ సంఘం నాయకులు, రైతులు

తొండంగి: పోలవరం కాలువ, పుష్కర పథకం, జాతీయ రహదారులకు ఇప్పటికే భూములిచ్చిన తాము ఉన్న కాస్త పొలాలను ఎయిర్‌పోర్టుకు ఇచ్చి నష్టపోలేమని అన్నవరం, పి.ఈ.చిన్నాయపాలెం, బెండపూడి(ఏబీసీ) గ్రామాల రైతుల సంక్షేమ సంఘం నాయకులు రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని పి.ఇ.చిన్నాయపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రభుత్వం ప్రతిపాదించిన విమానాశ్రయానికి భూములిచ్చేది లేదని మూడు గ్రామాల రైతులు ముక్త కంఠంతో స్పష్టం చేస్తూ మరోమారు తహసీల్దార్ మురార్జీకి వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే పోలవరం కాలువ, పుష్కర కాలువ, జాతీయ రహదారులకు దాదాపు 600 ఎకరాల వరకూ భూములిచ్చామని వివరించారు. మూడు గ్రామాలకు సంబంధించి 1200 మంది చిన్న,సన్న కారు రైతులతోపాటు పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడిన వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారన్నారు. రెండు పంటలు పండే పచ్చని పంట పొలాలను ఇస్తే వ్యవసాయంపై ఆధారపడిన రైతులు, కూలీలు కుటుంబాలు జీవనాధారం కోల్పోతాయన్నారు.

పెనుగుదురు, గురజనాపల్లి గ్రామాల మధ్య దాదాపుగా 3,000 ఎకరాలు ప్రభుత్వానికి చెందిన భూములున్నాయని, కాకినాడ సెజ్‌లో పదివేల ఎకరాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆ ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టుకు ప్రతిపాదన చేయాలని కోరారు. పచ్చని పొలాల్లో ప్రస్తుతం ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు తీర ప్రాంతంలో పారిశ్రామిక అవసరాల కోసం ఉద్దేశించిన కార్గో ఎయిర్‌పోర్టు మాత్రమేనని అన్నారు. దీనివల్ల రైతులతోపాటు ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులకు, ధ్వని, వాయుకాలుష్యం కారణంగా వైదిక కార్యక్రమాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని వివరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎయిర్‌పోర్టుకు భూమిలివ్వబోమని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టును మరోచోటి తరలించే వరకూ ఉద్యమిస్తామని తెలిపారు. రైతులు ఇచ్చిన వినతిపత్రాలను ప్రభుత్వ ఉన్నతాధికారులకు పంపుతామని తహసీల్దార్ మురార్జీ తెలిపారు. కార్యక్రమంలో ఏబీసీ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాలచెర్ల భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి రాయవరపు ఆనందరావు, రైతులు నరహరిశెట్టి సూర్యప్రకాష్, వడ్డి రాంబాబు, తంగెళ్ల శ్రీను, వడ్డి సుబ్రహ్మణ్యం, జీవీఎస్ శాస్త్రి, దాసరి సత్యనారాయణ పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్ పోటీలు ప్రారంభం



ఎస్.యానం బీచ్ వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఉన్న సముద్ర తీర ప్రాంతంలో జాతీయ స్థాయి బీచ్ వుమెన్ వాలీబాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో గోవా, పాండిచ్చేరి, గుజరాత్, తమిళనాడు, కేరళ, ఒడిశా, వెస్ట్ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటనున్నాయి. తొలి రోజు జరిగిన మ్యాచ్‌లలో గోవా-ఆంధ్రప్రదేశ్ జట్లు తలపడగా ఆంధ్రప్రదేశ్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్‌లో చెన్నై- వెస్ట్‌బెంగాల్ జట్లు తలపడగా చెన్నై విజయం సాధించింది. మూడవ మ్యాచ్‌లో పాండిచ్చేరి-కేరళ జట్లు తలపడ్డాయి. రాత్రి వరకు సముద్ర తీరంలో కొనసాగిన బీచ్ వాలీబాల్ పోటీలు చూడటానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ పోటీలు మరో రెండు రోజుల పాటు జరగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి న్యాయమూర్తి శుక్రవారం రూ.70 వేలు జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు. స్థానిక సీఐ బీ సూర్య అప్పారావు కథనం మేరకు ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఏడుగురిని ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కాటం భాను ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.10 వేల వంతున రూ.60,000 జరిమానా విధించారు. ఒకరికి వారం రోజుల పాటు జైలు శిక్ష విధించారు. రౌతులపూడి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరిని తుని కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రూ.10,000 జరిమామా విధించినట్టు సీఐ సూర్య అప్పారావు తెలిపారు.

ఇళ్లు పోతున్నాయన్న బెంగతో వ్యక్తి మృతి



సుందరయ్య

మలికిపురం: మండల పరిధిలోని మేడిచర్లపాలెంకు చెందిన చింతా సుందరయ్య (55) తమకు చెందిన ఇళ్లు పోతున్నాయన్న బెంగతో శుక్రవారం మృతిచెందారు. గ్రామ శివారు పెద్దకాల్వ గట్టు చర్చి వద్ద వీరు స్థిర నివాసం ఉంటున్నారు. రెండు నెలల క్రితం చేపట్టిన రైల్వే ఎలైన్‌మెంట్‌లో తన ఇంటితో పాటు, కుమారుల ఇళ్లు కూడా పోతున్నాయని ఆయన బెంగ పెట్టుకున్నారు. అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదన్న మనో వ్యధతో బాధ పడిన ఆయనకు వైద్యం చేయించినా ఫలితం లేకపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

భర్తతో వివాదం...పిల్లలతో ఆత్మహత్యకు యత్నం

దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపిన రైల్వే పోలీసులు



భార్యాభర్తలు లోవలక్ష్మి, శ్రీనుతో రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావు

అన్నవరం: భర్తతో వివాదం కారణంగా ఇద్దరు ఆడపిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన మహిళకు రైల్వే పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి కాపాడారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం నామవరానికి చెందిన కిల్లాడ లోవలక్ష్మికి ఇద్దరు పిల్లలు. భర్త శ్రీనుతో గొడవ పడి వేరుగా ఉంటోంది. ఆమె శుక్రవారం ఆత్మహత్య చేసుకుందామని పాయకరావుపేటలో ఉన్న భర్తకు పిల్లలను అప్పగించేందుకు వెళ్లింది. పిల్లలను తీసుకునేందుకు భర్త నిరాకరించాడు. దీంతో పిల్లలతో అన్నవరం రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండడంతో రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్యాం త్రినాథరావుకు అనుమానం వచ్చి ప్రశ్నించారు. ఆమె కుటుంబ తగాదాల గురించి చెప్పింది. ఆయన రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావుకు విషయం చెప్పారు. ఆమె భర్త శ్రీనును రైల్వేస్టేషన్‌కు రప్పించి భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

పిఠాపురంలో ఫ్లెక్సీల రగడ



పిఠాపురంలో ఆందోళన చేస్తున్న జనసేన నాయకులతో చర్చిస్తున్న పోలీసులు

కొత్తపల్లి: పిఠాపురంలో కూటమి పార్టీల మధ్య ఫ్లెక్సీల రగడ మొదలైంది. పిఠాపురం పట్టణంలో పలుచోట్ల ఉన్న జనసేన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. టీడీపీకి చెందిన ఫ్లెక్సీలను ఉంచి జనసేన ఫ్లెక్సీలను తొలగించడమేమిటంటూ జనసేన పార్టీ నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మెయిన్ రోడ్డులో బైఠాయించి ఆందోళన నిర్వహించారు. జనసేన నాయకులకు మున్సిపల్ అధికారులు సమాచారం ఇవ్వకుండా తొలగించడమేమిటంటూ ఆందోళన చేశారు. ఆందోళన చేస్తున్న జనసేన నాయకులతో పోలీసులు చర్చించడంతో ఆందోళన విరమించారు.

మండపంలో పోలీస్ పహారా



మండపంలో పహారా కాస్తున్న పోలీసులు

శంఖవరం: మండలంలోని మండపం గ్రామంలో వైఎస్సార్ సీపీ నేతలపై కూటమి నేతల దాడి నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు కాపలా కాస్తున్నారు. దాడుల కారణంగా గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. కూటమి నేతల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ నేతలకు అండగా ఉంటానని ఎవ్వరూ అధైర్యపడవద్దని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరి అన్నారు. దాడికి పాల్పడిన టీడీపీ నేతలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీపీ పర్వత రాజుబాబు బాధిత కుటుంబాలను పరామర్శించారు.

సందడికి వేళాయె

- జేఎన్‌టీయూకేలో నేటి నుంచి క్రియ పిల్లల పండగ
- రెండు రోజుల పాటు నిర్వహణ
- వివిధ ప్రాంతాల నుంచి 8,500 మంది విద్యార్థుల రిజిస్ట్రేషన్
- లఘు నాటికలు... 29 అంశాలపై పోటీలు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పిల్లల పండగ పేరుతో క్రియ స్వచ్ఛంద సంస్థ ప్రతి ఏడాది రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమానికి జేఎన్‌టీయూ కాకినాడ వేదిక కానుంది. జిల్లాతో పాటు రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమలో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని ప్రదర్శించే అవకాశం రావడంతో వివిధ ప్రాంతాల నుంచి 8,500 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్రియ స్వచ్ఛంద సంస్థ ప్రారంభించిన నాటి నుంచి మధ్యలో రెండేళ్లు కరోనా కారణంగా నిలిపివేసినా ఇప్పటి వరకూ పదిసార్లు ఈ కార్యక్రమం నిర్వహించారు. శనివారం నుంచి రెండు రోజులపాటు 11వ రాష్ట్ర అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తొలిరోజు నాటికలు, శాస్త్రీయ నృత్యం, ఏకపాత్రాభినయం, కోలాటం, పాటల గ్రూపు, పోస్టర్ ప్రజంటేషన్, సైన్స్ ప్రయోగాలు, డిబేట్, గణితం, క్విజ్, వ్యాసరచన, కథారచన, కథా విశ్లేషణ, అంతర్జాలంలో అన్వేషణ పోటీలు నిర్వహించనున్నారు. రెండవ రోజు ఆదివారం జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, బుర్రకథ, కోలాటం, ప్రాజెక్టు పని, వాద్య సంగీతం, పాటలు, కథ చెప్పడం, స్పెల్లింగ్, చిత్రలేఖనం, సృజనాత్మకత వస్తువుల తయారీ, మట్టితో బొమ్మలు తయారీ, మైమ్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. కార్యక్రమ నిర్వహణకు కమిటీ సభ్యులను నియమించి ఒక్కొక్క విభాగానికి టీమ్‌లను నియమించారు. వర్సిటీ ప్రవేశ ద్వారంలో రిజిస్ట్రేషన్ కౌంటర్ ఏర్పాటు చేసి పేర్లు నమోదు చేయనున్నారు. వర్సిటీ ఆడిటోరియం, బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయం, మెకానికల్ పీజీ బ్లాక్, డిజైన్ ఇన్నోవేషన్ సెంటర్ ఎడమ పక్కన, సీఎస్ విభాగం, ఈఈఈ బ్లాక్ వద్ద పోటీల ప్రదర్శనకు వేదిక ఏర్పాటు చేయగా వీసీ పరిపాలన భవనం వెనుక భోజన వసతి కల్పించనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు సందర్శనకు వచ్చే వారి వాహనాలు వర్సిటీకి ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాల ప్రాంగణంలో పార్కింగ్ చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ, లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, హాజరవుతున్నారు. రెండు రోజుల కార్యక్రమం అనంతరం ఆదివారం సాయంత్రం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు.



గత ఏడాది క్రియ పిల్లల పండగకు విచిత్ర వేషధారణలో వస్తున్న చిన్నారి